## ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు

మేడ్చల్, మే 7: ఇండియన్ ఎయిర్ ఫోర్స్(అగ్నివీర్ వాయు)లో మ్యూజిషియన్స్‌కు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై.. 18 నుంచి 21 ఏండ్లలోపు ఉన్న యువతీయువకులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న యువకులు https://agnipathivayu.cdac.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 11వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. అభ్యర్థులకు కీబోర్డు, వయోలిన్, ఫ్లూట్, గిటార్, బ్యాండ్, పియానో తదితర కళల్లో ప్రావీణ్యం ఉండాలని, రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 011-25694209, 25899808 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## నెంబర్ ప్లేట్లపై ఆందోళన వద్దు

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాహనాలకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ బిగింపు ప్రక్రియ తాము చేపట్టలేదని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ల బిగింపు తప్పనిసరి అని ఓ జీఓ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో చాలామంది వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్‌పై ఆరా తీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటివరకు తమకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ల బిగింపునకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు అందలేదని అధికారులు వెల్లడించారు. ఎప్పటిలాగే హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ సంబంధిత షోరూంలలో పొందొచ్చని వివరించారు. ఉమ్మడి వాహనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు తమకు రాలేదని పేర్కొన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

## స్లాటర్‌హౌస్‌ను పునఃప్రారంభిస్తాం

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్**



గౌలిపూరలోని స్లాటర్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ ): సంతోష్‌నగర్ సర్కిల్ గౌలిపుర మేకల మండి (స్లాటర్ హౌస్)ని త్వరలో పునఃప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. బుధవారం గౌలిపుర స్లాటర్‌హౌజ్ భవనాన్ని ఆయన పరిశీలించారు. గౌలిపుర మేకలమండి గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బాగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో దానిపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడ్డారని. ఉపాధి కోల్పోయి రోడ్డున పడినట్లు వారు తెలిపారు. కోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చి చాలారోజులు అవుతున్నందున స్లాటర్ హౌజ్‌లో సౌకర్యాలు కల్పించాలని కమ్యూనిటీ పెద్దలు కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్లాటర్ హౌజ్‌లో నీటి వసతి, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలని ఈ సందర్భంగా కమిషనర్‌కు వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై త్వరితగతిన ప్రతిపాదనలు తయారుచేయాలని ప్రాజెక్టు ఇంజనీర్‌ను కమిషనర్ ఆదేశించారు. వీలైనంత త్వరగా స్లాటర్ హౌజ్ పనులను పునఃప్రారంభిస్తామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పంకజ, జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ఎస్ శ్రీలక్ష్మి, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# సారు ముందు చూపు..
# సమస్య తీరింది చూడు

- మోడల్ రిజర్వాయర్ గా ఉస్మాన్ నగర్ జంట రిజర్వాయర్లు
- స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో వాల్వ్ నిర్వహణ
- సోలార్ పవర్ తో లైట్లు, డ్రిప్ పద్ధతిలో గార్డెనింగ్ నిర్వహణ
- ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2లో పూర్తయిన రిజర్వాయర్లు

**ఔటర్ రింగ్ రోడ్డు ప్రజల దాహార్తి తీర్చనున్న కేసీఆర్ సంకల్పం**

సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ) : నాడు కేసీఆర్ సర్కారు చేపట్టిన భగీరథ ప్రయత్నం నేడు ఔటర్ రింగ్ రోడ్డు ప్రజల దాహార్తిని తీర్చనుంది. రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఉస్మాన్ నగర్ జంట రిజర్వాయర్లు దాదాపు లక్ష మంది జనాభాకు శుద్ధి చేసిన తాగునీరు అందించనున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా చేసేందుకు గత ప్రభుత్వంలో జలమండలి ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2, ప్యాకేజీ 2 పనులకు శ్రీకారం చుట్టింది. పటాన్ చెరు నియోజకవర్గంలోని ఉస్మాన్ నగర్ లో నిర్మిస్తున్న 4ఎంఎల్, 2ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే రిజర్వాయర్ల ఇన్‌లెట్, అవుట్ లెట్ నిర్మాణం పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఇటీవలే ఎలక్ట్రికల్ పనులు, క్లోరిన్ రూమ్ పనులు పూర్తి చేయగా అంతర్గత రహదారులు, సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయనున్నారు.

### ఆహ్లాదం కోసం..

రిజర్వాయర్ ప్రాగణంలో సోలార్ ప్యానల్ తో లైట్లు ఏర్పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ పనులు. మొక్కల పెంపకానికి డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో గార్డెనింగ్ నిర్వహణ ,నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న రిజర్వాయర్లపై వివరాలతో కూడిన సైన్ బోర్డులను ఏర్పాటు చేయనున్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

### ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2 స్వరూపం

ఓఆర్ఆర్ ఫేజ్ -2 ప్రాజెక్టును మొత్తం రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టగా కొత్తగా 71 సర్వీసు రిజర్వాయర్లు (140.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2758 కిలో మీటర్ల మేర నూతన పైపు లైను నెట్ వర్క్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయి రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే మొత్తం 3.6 లక్షల కుటుంబాలు, 25 లక్షల జనాభాకు ప్రయోజనం కలగనుంది. చేయాలని నిర్ణయించారు. మొదటి ప్యాకేజీలో రూ. 613 కోట్లతో 33 సర్వీసు రిజర్వాయర్లు, 1522 కిలోమీటర్ల మేర పైపు లైను నెట్ వర్క్ నిర్మాణం చేపడుతున్నారు. దీని పరిధిలోకి సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఘట్ కేసర్, కీసర (7 మండలాలు) ప్రాంతాల్లోని 4.36 లక్షల మంది దాహార్తి తీరనుంది. రెండో ప్యాకేజీలో కొత్తగా 38 సర్వీసు రిజర్వాయర్లు, 1250 కిలో మీటర్ల మేర పైపు లైను నెట్ వర్క్ నిర్మాణం చేపడుతుండగా వీటికయ్యే ఖర్చు రూ.587 కోట్లు. రాజేంద్రనగర్, శామీర్ పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, పటాన్ చెరు, ఆర్సీపురం, బొల్లారం (5 మండలాలు) 1.96 లక్షల మందికి లబ్ది చేకూరనుంది.



### సాంకేతికతను ఉపయోగిస్తూ..

నీటివృథాను కట్టడి చేసేందుకు ప్రయోగాత్మక చర్యలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ రెండు రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కనూ లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్ పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తెలుస్తుంది. దాని ద్వారా వృథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకునే ఆస్కారం ఉండనుంది. డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ పై స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో లైన్ మెన్లు క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే మొబైల్ యాప్ తో వాల్వులను నిర్వహించే విధంగా స్మార్ట్ వాల్వ్ ఏర్పాటు చేయనున్నన్నారు. ఇంటర్ నెట్ ఆధారిత కమ్యూనికేషన్ తో ఆపరేట్ చేసే వాల్వ్ ఆపరేషన్ తో పాటు వాటర్ క్వాలిటీ, క్వాంటిటీ, క్లోరిన్ శాతం వివరాల్ని తెలుసుకునేందుకు ఆస్కారం ఉంది. ఈ స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీ ఆధారంగా పనిచేయనుంది. మంగళవారం పనుల పురోగతిని పరిశీలించిన జలమండలి ఎండీ ఆశోక్‌రెడ్డి ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ఇప్పటివరకు సనత్ నగర్ లో సమర్థంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రిజర్వాయర్ నీటి మట్టం, క్లోరిన్ శాతపు వివరాలను ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసిన డాష్ బోర్డుకి అందేలాగా, ఒకవేళ రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న నీటిలో క్లోరిన్ శాతం తగ్గితే వెంటనే సంబంధించిన అధికారులకు అలర్ట్ అందేలాగా ఆన్ లైన్ మానిటరింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.




పూర్తయిన రిజర్వాయర్

# గ్రీన్‌ఫీల్డ్..మాకొద్దు..

మొదటి పేజీ తరువాయి..

### రైతులు తక్కువ.. పోలీసులే ఎక్కువ

గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూ బాధితులతో రావిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో రైతుల కంటే పోలీసులే ఎక్కువగా కనిపించారు. గ్రామసభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, కె.రాజు పెద్దఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు. అప్పటికే గ్రామసభ నిర్వహించే ప్రాంతం చుట్టు పోలీసులను ఏర్పాటు చేశారు.

### మా భూములు గుంజుకొని మా పై పోలీసుల దాడులు

ప్రభుత్వం మా భూములను రోడ్డు కోసం గుంజుకొని మా భూముల్లోకి రాకుండా పోలీసులతో వచ్చి సర్వే చేశారు. మా భూముల్లోకి పోతే మీ మెడలు పట్టి నెట్టివేశారు. నాకు ఉన్న సర్వే నంబర్ 13లో ఎకరం భూమి పూర్తిగా పోతున్నది. కనీసం ఎంత రేటు ఇస్తున్నరో అడుగుదామని అనుకున్నా పోలీసులు అడ్డుపడుతున్నారు. మా సమస్యలు వినకుండా మేము ఎందుకు గ్రామ సభలో ఉండాలి? అందుకే మేము గ్రామసభను బహిష్కరిస్తున్నాము. కలెక్టర్ వచ్చి గ్రామసభలో మాకు సమాధానం చెప్పాలి.

*- కాసుల సుధాకర్, భూ బాధితుడు, రావిర్యాల గ్రామం*

### మా అమ్మగారు కట్నం కింద ఇచ్చిన భూమి పోతుంది..

సారూ నాకు మా అమ్మగారు కట్నం కింద సర్వే నంబర్-13లో 20 గుంటల భూమి ఇచ్చిండ్రు. మా బతుకు మొత్తం ఆ భూమి పైనే ఆధారపడి జీవిస్తున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. ఇప్పుడు అక్కడ అమ్ముకుంటే కోట్ల రూపాయలు వస్తాయన్నారు. ఇప్పుడు ప్రభు త్వం ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటుతో నా భూమి అందులో పోతుంది. ఇప్పుడు ప్రభుత్వం కేవలం తక్కు వ ధరను ఇస్తుందని అంటున్నారు. ఇప్పటికి ఎంత ధర ఇస్తారో కూడా చెప్పడం లేదు.

*- రమాదేవి, భూ బాధితురాలు, రావిర్యాల గ్రామం*

### ఉన్న భూమి మొత్తం పోతుంది..

నాకు సర్వే నంబర్ 13లో 3 ఎకరాల 20 గుంటల భూమి ఉన్నది. మా కుటుంబం దానిని వ్యవసాయం చేసుకుంటూ జీవితం గడిపేవాళ్లం. ఇప్పుడు ఆ ఉన్న భూమి కూడా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డులో పోతున్నది. మా దగ్గర నుంచి బలవంతంగా గుంజుకున్నా మాకు ఎక్కువ రేటు ఇవ్వాలి. కనీసం నేడు ఆ ప్రాంతంలో పోతున్న రేటు ప్రకారం చెల్లించాలి. లేకుంటే మా బతుకులు రోడ్డు మీదకు వస్తాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.

*- గున్నాల నర్సింహ, భూ బాధితుడు, రావిర్యాల గ్రామం*

## సమ్మర్ క్యాంపులు విద్యార్థుల ప్రతిభను మెరుగుపరుస్తాయి




బొంపల్లి పాఠశాలలో సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

**డీఈవో రేణుకాదేవి**

దోమ, మే 7 : సమ్మర్ క్యాంపులు విద్యార్థుల ప్రతిభను మెరుగుపర్చడమే కాకుండా సృజనాత్మకతను పెంపొందిస్తాయని డీఈవో రేణుకాదేవి అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు, ఏఐ తరగతులను బుధవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించి వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపుల ద్వారా వెనుకబడిన విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథ్స్‌తో పాటుగా వారికి బొమ్మలు గీయడం, రంగులు వేయడం, కంప్యూటర్ పరిజ్ఞానం, కల్చరల్ యాక్టివిటీస్ వంటి కార్యక్రమాల ద్వారా చైతన్యవంతులను చేయాలని డీఈవో క్యాంపు నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ షఫీ, ఏపీఎం సురేశ్, గ్రామ యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నమ్మక ద్రోహం కాంగ్రెస్ నైజం

- తప్పుల తడకగా రాష్ట్ర ప్రభుత్వ బీసీ కులగణన
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



అభివాదం చేస్తున్న మధుసూదనాచారి, బీసీ నేతలు

ఖైరతాబాద్, మే 7: బీసీ కులగణన తప్పులతడకగా చేసి.. ఆ వర్గాలకు ఏదో చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని బీసీ సంఘాల సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావు అధ్యక్షతన బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీలపై కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. సమావేశంలో పాల్గొన్న శాసనమండలి ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ..కేంద్రం చేపట్టే కులగణన అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. రాష్ట్రంలో కులగణనను చేస్తామంటే రేవంత్ రెడ్డి మాటలను నమ్మేందుకు సిద్ధంగా లేమన్నారు. నమ్మకం ద్రోహం కాంగ్రెస్ నైజం అన్నారు. తొలుత కులగణన చేస్తామని, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి .. బీసీలందరూ ఉద్యమిస్తే కాని కులగణన చేపట్టలేదన్నారు. అది కూడా తప్పుల తడకగా చేశారని మధుసూదనాచారి ఆరోపించారు. అనంతరం పలు తీర్మాణాలను ప్రవేశపెట్టారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం, నాయకులు.. ఆనంద్ గౌడ్, వెంకటేశ్, మల్లేశ్, రామకృష్ణయ్య, అంజి, అనంతయ్య, సతీశ్, రామకోటి, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎలివేటెడ్‌పై మరోసారి గ్రామసభలు

- కారిడార్ భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బాధితులు
- మరోసారి నచ్చజెప్పేందుకు సర్కార్ యత్నం
- ఈనెల 9న మూడు గ్రామాల్లోని బాధితులతో సమావేశం



మేడ్చల్, మే7 (నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణపై గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ రింగ్‌రోడ్డు వరకు 18 కిలోమీటర్ల మేర నిర్వహించనున్న కారిడార్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ పక్రియకు ఓ వైపు రక్షణ శాఖ కొర్రీలు, మరోవైపు స్థానికుల వ్యతిరేకతతో బ్రేక్ పడిన విషయం విదితమే. అయితే భూ సేకరణ పక్రియపై ఇదివరకు ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలను గ్రామస్తులు బహిష్కరించి న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో తిరిగి ఈనెల 9న గ్రామాలకు సంబంధించిన గ్రామసభను లోతుకుంటలో రెవెన్యూ అధికారులు నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనను విడుదల చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని తూకుంట నుంచి శామీర్‌పేట్ రింగ్ రోడ్డు వరకు 12 కిలోమీటర్ల పొడువైన రోడ్డు విస్తరణకు అవసరమైన భూమిని గుర్తించి వారికి నోటీసులు జారీచేసి భూ సేకరణకు సహకరించేలా గ్రామసభలను నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే తూకుంట, హకీంపేట్, పోతాయిపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులు తమ భూములను ఇవ్వమంటూ గతంలో నిర్వహించిన గ్రామసభను బహిష్కరించడమే కాకుండా కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు.

### 100 ఫీట్ల వరకే భూ సేకరణ చేయాలి..

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి 200 ఫీట్ల రోడ్డు విస్తరణ వల్ల తాము నష్టపోతామని తమకు నష్టం జరగకుండా చూడాలని తూకుంట, పోతాయిపల్లి, హకీంపేట్ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 200 ఫీట్ల రోడ్డు విస్తరణతో ఇండ్లతో పాటు వ్యవసాయ భూములను కోల్పోతున్న దృష్ట్యా 100 ఫీట్ల రోడ్డు విస్తరణను మాత్రమే చేయాలని కోరుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండగా హైదరాబాద్ జిల్లాలోని లోతుకుంట నుంచి ప్యారడైజ్ వరకు 6 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంటుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు రోడ్డు విస్తరణపై న్యాయస్థానాలను ఆశ్రయించిన విషయం విదితమే.ఆది నుంచీ ఎలివేటెడ్ విషయంలో ప్రభుత్వానికి వ్యతిరేకత తప్పడం లేదు. ముందు రక్షణ శాఖ అధికారులు భూకేటాయింపునకు ససేమిరా అనగా.. స్థానికులు సైతం రోడ్డు విస్తరణకు భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో ప్రాజెక్ట్ ప్రశ్నార్థకంగా మారింది.


## విద్యుత్ కనెక్షన్‌కు లంచం డిమాండ్

**ఏసీబీకి చిక్కిన విద్యుత్ సిబ్బంది**

అంబర్‌పేట, మే 7: ఇంటికి కొత్త కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన కేసులో అంబర్‌పేట సబ్‌స్టేషన్ అసిస్టెంట్ లైన్‌మెన్ శివ మల్లేశ్ సహాయకుడు పారేపల్లి సంతోష్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విషయం తెలియగానే అసిస్టెంట్ లైన్‌మెన్ శివ మల్లేశ్ పరారయ్యాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు.. అంబర్‌పేటకు చెందిన ఓ ఆటో డ్రైవర్ ఇంటికి ఉన్న పాత మీటర్ పనిచేయకపోవడంతో అసిస్టెంట్ లైన్‌మెన్ శివ మల్లేశ్ కొత్త మీటర్‌ను బిగించాడు. కొత్త మీటర్‌తో పాటు పాత మీటర్‌కు కూడా డ కనెక్షన్ ఇస్తానని చెప్పి ఆఫీసుకు పిలిపించుకొని రూ.50వేలు లంచం డిమాండ్ చేశాడు. సదరు వ్యక్తి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాను. నేను అంతగా ఇవ్వలేనని మొరపెట్టుకున్నా శివ మల్లేశ్ వినలేదు. చివరకు రూ.30 వేలకు బేరం కుదుర్చుకున్నాడు బుధవారం సాయంత్రం శివ మల్లేశ్, మధ్యవర్తి పారిపెల్లి సంతోష్‌తో డబ్బులు స్థానికంగా ఉండే అలీ కేఫ్ చౌరస్తాలోని ఒక హోటల్‌కు రప్పించుకొని అతనికి ఇవ్వమని చెప్పి తను బయట ఉన్నాడు. మధ్యవర్తికి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు వల వేసి పట్టుకున్నారు. విషయాన్ని గమనించిన శివ మల్లేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఏసీబీ అధికారులు విద్యుత్ కార్యాలయానికి వచ్చి పలు వస్తువులను స్వాధీనం చేసుకొని మధ్యవర్తిని అరెస్టు చేసి తీసుకెళ్లారు. శివ మల్లేశ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఏసీబీ అధికారి గంగసాని శ్రీధర్ తెలిపారు.

## 'మెట్రో చార్జీల పెంపు విరమించుకోవాలి'

**సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రేటర్ కార్యదర్శి హన్మేశ్**



సమావేశంలో మాట్లాడుతున్న హన్మేశ్

ముషీరాబాద్, మే 7: సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యాలయం (మార్క్స్ భవన్)లో హైదరాబాద్ మెట్రో చార్జీల పెంపు ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హన్మేశ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరుగగా పలువురు వామపక్ష నేతలు పాల్గొని ప్రసంగించారు. సీపీఐఎం సెంట్రల్ కార్యదర్శి వెంకటేశ్, సీపీఐ నగర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, జి ఝాన్సీ న్యూడెమొక్రసీ, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి, తేజు, నగర నాయకులు, విజయ్ సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ నగర కార్యదర్శి, సీపీఎంఎల్ మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు ఎస్ఎల్ పద్మ, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడారు. ప్రభుత్వం మెట్రో చార్జీల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకోకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీయూసీఐ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి ప్రవీణ్, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు రవి, కృష్ణ పాల్గొన్నారు.

# కబళించిన మృత్యువు

- జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌లోని పవర్ ప్లాంట్ లిఫ్ట్ కూలి ముగ్గురు కార్మికుల దుర్మరణం
- సేఫ్టీ నిబంధనలు పాటించని హెచ్‌ఎంఈఎస్‌పీఎల్ యాజమాన్యం!
- బాధిత కుటుంబాలకు రూ.30లక్షలు ఇవ్వాలన్న సీఐటీయూ

జవహర్‌నగర్, మే 7: బతుకు దెరువు కోసం రాష్ట్రాలుదాటి వచ్చి కుటుంబాలను పోషించుకుని నాలుగు పైసలు సంపాదించుకుందామకుని ఆశపడ్డ కార్మికుల జీవితాలు అడియాశలయ్యాయి... అందరితో కలిసి పనికోసం వెళ్లిన యువకులను లిఫ్ట్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ హృదయవిదారక ఘటన జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్‌యార్డ్ పవర్‌ప్లాంట్ ఫేస్-2 చిమ్నీలో బుధవారం కొంతమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఉదయం 11గంటల సమయంలో ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న క్రమంలో లిఫ్ట్‌తెగి పడటంతో అక్కడే పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులు సూరజ్ సర్కార్(25), ప్రకాశ్ మండల్ (29), ఉత్తరాఖండ్‌కు చెందిన అమిత్‌రాయ్(25) తీవ్రగాయాలపాలై ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. పోలీసులు మృతదేహాలను గాంధీ దవాఖానాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌లోని పవర్‌ప్లాంట్

### నిబంధనలు పట్టించుకోని యాజమాన్యం..!

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌లో కార్మికులు పని చేసే క్రమంలో నిబంధనలు పాటించకపోవడం వల్లే కార్మికులు దుర్మరణం పాలయ్యారని సీఐటీయూ నాయకులు ఆరోపిస్తున్నారు. డంపింగ్‌యార్డ్‌లో సుమారు 15ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి సేఫ్టీని యాజమాన్యం కల్పించడంలేదని, దీంతో ఎంతోమంది కార్మికులు తమ కాళ్లను, చేతులను, ప్రాణాలను పోగొట్టుకున్నారని వారు ఆరోపించారు. ఇంకెంతమంది ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించరు.హెచ్‌ఎంఈఎస్‌పీఎల్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ కూలిన ఘటనలో తమ తోటి కార్మికులను కోల్పోయిన వారు కూడా పనిచేసే చోట తమకు తగిన సేఫ్టీ కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాలను యాజమాన్యం అన్నివిధాలుగా ఆదోకోవాలని వారు డిమాండ్ చేశారు.

### బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

లిఫ్ట్ కూలి కార్మికులు చనిపోయిన ఘటనపై హెచ్‌ఎంఈఎస్‌పీఎల్ యాజమాన్యం స్పందించింది. ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరుగుతుందని వెల్లడించారు. బాధిత కుటుంబ సభ్యులకు తాము అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.